https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 63 | కర్నూలు | శనివారం 11-04-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi




మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



# కేబినేట్ ఎజెండా ముందే లీక్

**కీలక అంశాలు సైతం ముందే వెల్లడి**
**గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు**
**సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత**
**కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్**
**జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం**



అమరావతి,ఏప్రిల్10(శ్రీచక్ర) సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరును ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలను అందుబాటు లోకి తీసుకురావాలన్నారు.

# పరాకాష్టకు చేరిన వైసిపి రాజకీయం

**క్రిమినల్స్ ఇలానే రాజకీయంచేస్తారు**
**మంత్రులతో సిఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి,ఏప్రిల్10(శ్రీచక్ర) : వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరని సీఎం చంద్రబాబు అన్నారు. వైసిపి క్రిమలన్ రాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సూచించారు. వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏపీ కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో నూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలని, అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలని మంత్రులకు సీఎం సూచించారు. 'క్రిమినల్స్ ఇలానే రాజకీయాలు చేస్తారు. వాళ్ల ఆటలు సాగనివ్వకూడదు. ప్రజలకు నిజాలు తెలియచేస్తే సరిపోతుంది. డైవర్షన్ పొలిటిక్స్‌కు వాళ్లు అలవాటు పడ్డారు' అంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.

# రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

**క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు**
**విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు**
**విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు**
**సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు**
**కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**

అమరావతి,ఏప్రిల్10(శ్రీచక్ర) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

**జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు**
**జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం**
**ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం**



విశాఖపట్నం,ఏప్రిల్10(శ్రీచక్ర) ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది.విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది.భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది.అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది.ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది.భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి

**జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం**
**వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం**
**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**



శ్రీకాకుళం,ఏప్రిల్10(శ్రీచక్ర) :ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు.2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

న్యూఢిల్లీ,ఏప్రిల్10(శ్రీచక్ర) బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.



# జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

## చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా శివ రామచంద్ర రావు నియామకం




కర్నూలు లీగల్, ఏప్రిల్ 10 (శ్రీ చక్ర ): జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా న్యాయవాది యం. శివ రామచంద్ర రావుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి నియామకం పత్రాన్ని అందజేశారు.

## చెత్తా శుద్ధీకరణ త్వరితగతిన పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారి డా. ఏ.సిరి





కర్నూలు, ఏప్రిల్ 10 (శ్రీచక్ర): నగరంలోని ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణలో భాగంగా గార్గేయపురం డంప్‌యార్డులో నిల్వ ఉన్న లెగసీ వ్యర్థాలను బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా త్వరితగతిన శుద్ధి చేసి, భూభాగాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి దేవనగర్‌లోని మురుగు శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), గార్గేయపురం డంప్యార్డును పరిశీలించారు. గార్గేయపురం డంప్‌యార్డులో సుమారు 15 ఎకరాల్లో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలపై బయో మైనింగ్, బయో రిమిడియేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి, రికవర్డ్ మెటీరియల్ను శాస్త్రీయంగా వర్గీకరించి వినియోగించాలన్నారు. తదనంతరం వేస్ట్ టు ఎనర్జీ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) ప్లాంట్ల స్థాపనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అమలు దశకు తీసుకెళ్లాలని ఆదేశించారు. దేవనగర్ వద్ద మురుగు శుద్ధి కేంద్రం నిర్వహణను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) ప్రకారం మెరుగుపరచాలని, ట్రీటెడ్ వాటర్ నాణ్యతను నిరంతరం మానిటరింగ్ చేయాలని సూచించారు. అదేవిధంగా, సంబంధిత మౌలిక వసతుల నిర్వహణ బాధ్యతలను త్వరలో పబ్లిక్ హెల్త్ విభాగం నుండి కార్పొరేషన్‌కు బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గుర్రప్ప, డిఈ యూ.వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేష, నగరపాలక ఎస్ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు గిరిరాజ్, డిఈఈలు పవన్, ఏఈ వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి పరీక్ష-ప్రిన్సిపాల్ అశోక్ నాయక్




మంత్రాలయం ,ఏప్రిల్ 10,(శ్రీచక్ర) :మండల పరిధిలోని రచ్చుమర్రి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2026, 2027 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి, ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రచ్చుమర్రి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు. ఏప్రిల్ 12 వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 112 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని,విద్యార్థులు వచ్చేటప్పుడు పరీక్షకు అవసరమైన పెన్నులు,ప్యాడు, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు.

### అందరికీ తాగునీరు అందాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి







కర్నూలు, ఏప్రిల్ 10 (శ్రీచక్ర): జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను హెచ్చరించారు.శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో తాగునీరు,పారిశుధ్య మిషన్ సమావేశం మరియు తాగునీటి సమస్యలు, పారిశుధ్యం అంశాల పై అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడం, బోర్‌వెల్స్ తరచుగా పాడైపోవడం వల్ల త్రాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. తుంగభద్ర డ్యామ్ నుండి జనవరి 20 వరకు నీటిని విడుదల చేయడం వల్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నింపుకున్నామని, మార్చి 20 వ తేదీ నుండి మళ్లీ నీటి విడుదల ప్రారంభమైనందున, ట్యాంకులను నింపుతున్నామని, ఆగస్టు చివరి వరకు నీటి కొరత ఉండదని భావిస్తున్నామన్నారు. నీటి వనరులు ఉన్నాయి, అయినా నీటి సమస్యలు ఎందుకు వస్తున్నాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రాంతానికి సమానంగా నీటి సరఫరా జరగాలన్నారు. ఎక్కడైనా పక్షపాతం లేదా నిర్లక్ష్యం జరిగితే సహించబోనని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి గ్రామాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, క్రమం తప్పకుండా వాటిని పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. అదే విధంగా తాను పర్యటన కు వెళ్ళిన సమయంలో కొన్ని చోట్ల చెత్త శుభ్రం చేస్తున్నట్లు, కొన్ని చోట్ల చెత్తను అలాగే వదిలేస్తున్నట్లు గమనించామని, అలాగే కొన్ని చోట్ల తాగు నీరు వృథా అవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకే ప్రాంతం నుండి తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పత్రికల్లో ప్రతికూల వార్తలు రెండు మూడు సార్లు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందికి మూడు ఇంక్రిమెంట్లు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు సరఫరా చేయడం లేదని ప్రతికూల వార్తలు రాకూడదన్నారు. అదే విధంగా లీకేజీ సమస్యలు కూడా ఉండకూడదన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ ప్రాథమిక బాధ్యత పారిశుధ్యం శుభ్రంగా ఉంచడం త్రాగునీరు సమస్యలు లేకుండా చూసుకోవడం అని, పై నుండి కింది స్థాయి సిబ్బంది వరకు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిన్న తాను కోసిగి కి క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళిన సమయంలో ఒక మైనర్ అమ్మాయికి బాల్య వివాహం చేస్తున్నారని విషయం తెలిసి, ఆ పెళ్లిని ఆపగలిగానన్నారు. తహసీల్దార్, ఓఖఆూ, అఆఖూ లు, వారి స్టాఫ్ ఏం చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు? బాల్య వివాహాలను ఆపాల్సిన బాధ్యత అందరి మీద ఉంటుందన్నారు. నీటి సరఫరాలో వివక్ష చూపకూడదని, అందరికీ సమానంగా మరియు న్యాయంగా నీరు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక ఏరియాలో ఎక్కువ, మరొక ఏరియాలో తక్కువ నీరు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ సమానంగా నీరు ఇవ్వాలన్నారు. ఓహెచ్ఆర్ఎస్ ట్యాంక్ లపై క్లోరినేషన్ ఎప్పుడు చేశారు, బ్లీచింగ్ ఎప్పుడూ చేశారనే తేదీలు ఖచ్చితంగా రాయాలని, ఏమీ రాయకుండా ఖాళీగా ఉన్న బోర్డులు కనిపిస్తే, దీనికి బాధ్యులైన వారి మీద చర్యలు ఉంటాయన్నారు. మున్సిపల్ ఏరియాల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ సెగ్రిగేషన్ పనులు బాగానే జరుగుతున్నాయన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాలకి వచ్చేసరికి తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా చేయడం కనపడడం లేదన్నారు. ప్రతి ఒక్క ాచిఖఅ షెడ్ సరిగ్గా పనిచేసి వర్మీ కంపోస్ట్‌గా మార్చే పనులు జరగాలని డిపివో ను ఆదేశించారు. అనంతరం పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై మండల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పైప్లైన్ ల లీకేజీ లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ సీఈఓ రమణా రెడ్డి, డిఎమ్హెచ్ఓ డా.కామేశ్వర రావు, ఐసిడిఎస్ పిడి విజయ, డిపిఓ భాస్కర్, డి ఆర్ డి ఎ పిడి రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సర్వభూత దయయే తపస్సు

### తితిదే డాక్టర్ మల్లు వేంకటరెడ్డి

### కరిమద్దెలలో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు







గడివేముల, ఏప్రిల్ 10 (శ్రీచక్ర): సర్వభూతములపై దయకలిగి ఉండడమే నిజమైన తపస్సని, భూతదయ పరమాత్మృష్టమైన మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గడివేముల మండలం, కరిమద్దెల గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగు తున్న ధార్మిక కార్యక్రమాలలో భాగం గా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. గత మూడు రోజులు కె. సిద్ధారెడ్డి శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతంపై చేసిన ప్రవచనాలు,తెలుగు నాగరాజుబృందం చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త సమాజ సభ్యులు ఎ. సోమసుందర రెడ్డి, యం. శివారెడ్డి, కె.శివారెడ్డి, కె. నారాయణ, ఎస్.శేఖర్ రెడ్డి, గుండం వెంకట రెడ్డి, జి. జయమ్మ, పూజారి కరణం జ్యోతి, పి. రామలక్ష్మమ్మ,అరుణలక్ష్మి, ఎ. ఎల్లమ్మ, కుమ్మరి వెంకట సుబ్బమ్మ, లక్ష్మిదేవి, సుబ్బలక్ష్మన్న,హరిత, శోభ,చెన్నమ్మ పాటుభజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## వై. సీతారామిరెడ్డి జన్మదిన వేడుకలు..



మంత్రాలయం , ఏప్రిల్ 10,(శ్రీచక్ర) : మండల కేంద్రమైన మంత్రాలయం లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ నిర్వహకులు పత్తికొండ అసెంబ్లీ పరిశీలకులు సీనియర్ నేత వై. సీతారామిరెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ మండలాధక్ష్యులు భీంరెడ్డి ,ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్య అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రాఘవేంద్ర కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకులు , రాంపురం రెడ్డి సోదరులు అభిమానులు మధ్య కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మిగనూరులోని భీమ నిలయం లో వై.సీతారామిరెడ్డి కి మండలాధక్ష్యులు భీంరెడ్డి , ఉపాధ్యక్షులు భీమయ్య ,మాజీ ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ శాలువా కప్పి ,పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.వారితో పాటు వైఎస్ నాయకులు కురువ మల్లికార్జున వికెసి రఘు,దామోదరగుప్త,శివ,బాస్కర్, పేగులు రాముతదితరులుఆయన శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.

## వి.తిమ్మాపూరం గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



మంత్రాలయం,ఏప్రిల్10,(శ్రీచక్ర) : మంత్రాలయంమండలపరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు తిమ్మాపురం గ్రామంనుండి గ్రామ దేవత రామమ్మ గుడి వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు గ్రామ టిడిపి నాయకులు టి. కేశవన్న , టీ కిష్టప్ప టి. దేవేంద్ర బి రాజు ఎండి రాగప్ప ఏసేపు శుక్రవారం తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నాం:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



నంద్యాల, ఏప్రిల్, 10 (శ్రీచక్ర): కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎకనామిక్ ఆఫీసర్ రూబల్ కుమార్, డ్వామా పిడి సూర్యనారాయణ మూర్తి, హౌసింగ్ పిడి శ్రీహరి గోపాల్, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి అమలు చేస్తున్న పథకాలైన హౌసింగ్, ఉపాధి హామీ పనులు, పంచాయతీ రాజ్ పనులు, నైపుణ్య అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు రావడం జరిగిందన్నారు. వారు జిల్లాలోని బనగానపల్లె, రుద్రవరం, కొలిమిగుండ్ల, నంద్యాలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. హౌసింగ్, ఉపాధి హామీ పనులు ఒకే ఐడి వచ్చేలా చూడాలని, చాబోలులో గ్రామంలో సాగి పథకం క్రింద ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ పనులతో మిగతా పనులు కూడా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా డిసిల్టింగ్, ఫీల్డ్ ఛానెల్స్ పనులు కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రణాళికల వారీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలు, ఎస్పీఓలకు వారి వీధుల పట్ల మంచి అవగాహన కలిగి ఉన్నారని ఏ రాష్ట్రంలో కూడా ఇంతటి సమన్వయంతో పనులు జరగట్లేదని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

## 20న జరగబోయే "సర్వ శాంతి - విశ్వ శాంతి" వేడుకను హిందూ, వీరశైవ లింగాయత్ లందరూ కలిసి జయప్రదం చేయండి



,ఎమ్మిగనూరు, ఏప్రిల్, 10 (శ్రీ చక్ర):-ఎమ్మిగనూరు టౌన్ లోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయవాది శ్రీ కాకర్ల చంద్ర శేఖర్ వారి స్వగ్రుహంలో ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మిగనూరు ×తాలుకా" వీరశైవ లింగాయత్ సంక్షేమ సేవా సమితి" అధ్యక్షులు బిసి.నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ సనాతన ధర్మచార పథంలో భాగంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయవాది శ్రీ కాకర్ల చంద్ర శేఖర్ ఈ నెల 20వ తేదీ సోమవారం అక్షయతృతీయ మరియు జగజ్యోతి, విశ్వ గురువు, మహత్మ శ్రీ బసవేశ్వర స్వామి జయంతి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని గాంధీ నగర్ కాలనీ లోని ఆయన స్వగ్రుహంలో స్వంత ఖర్చులతో "సర్వ శాంతి - విశ్వ శాంతి" వేదనతో శ్రీ మహాగణపతి పూజ, గోపూజ, గోదానం, సిద్ద అఘోర పాశుపత హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, శ్రీ శ్రీనివాసులు కళ్యాణం, 365 లింగాలతో మహ సహస్ర లింగార్చన, మరియు బసవ జయంతి మొదలైన ఎన్నో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం లోని హిందూ భాంధవ్యులు అలాగే జంగమ, వీరశైవ లింగాయత్ కమ్యూనిటీ భాంధవ్యులందరూ తప్పకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున విరివిగా వివిధ సామాజిక వర్గానికి చెందిన రాజకీయ నాయకుల ప్రముఖులు వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు, వర్తక, వాణిజ్య, వ్యాపార వేత్తలు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్యకర్తలైన శ్రీనివాసులు, శివ రాజ్ కుమార్, మల్లికార్జున, మంజు నాథ్, విజయ్ కుమార్, రామలింగ, వెంకటేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధానోపాధ్యాయులు పబ్బారెడ్డి.నాగిరెడ్డి పదవి విరమణ..,

### ఉత్తమ నెల్లూరులో పబ్బారెడ్డి. నాగిరెడ్డి ని ఘనంగా సన్మానించిన గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు..,



కోట : ఏప్రిల్ 10 (శ్రీ చక్ర): కోట మండలం ఉత్తమనెల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న పబ్బారెడ్డి.నాగిరెడ్డి పదవీవిరమణ పురస్కరించుకుని పాఠశాలలోని ఉపాధ్యాయులు శాలువాలు,పుష్పగుచ్చాల తో సత్కరించారు.అలాగే నాగిరెడ్డి మనవరాలు సితార 2వ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు బహుమతులతో పాటు భోజన వసతిని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామపెద్దలు జంగిట. కృష్ణయ్య,పొక్కాలి. బాలాజీ,దువ్వూరు.శ్రీనివా సులు రెడ్డి,విశ్రాంతి ఉపాధ్యాయులు ఆవుల.సుబ్బయ్య పూలమాలలు, శాలువాలుతో, బొకేలతో నాగిరెడ్డినిఘనంగాసన్మానించి,పాఠశాలతోఆయనకున్నబంధాన్ని వివరించారు. పనిచేసినటువంటి అదే పాఠశాల అభివృ ద్ధి కోసం నాగిరెడ్డి లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు.అలాగే కోటలో విద్యాశాఖ కార్యక్రమం లో ఎంఈవో లు శిరీషా,మస్తానయ్య,సీఆర్పీ లు నాగిరెడ్డిని సత్కరించారు.

## జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిమూలం



వరదయ్యపాలెం ఏప్రిల్ 10(శ్రీ చక్ర) పనులు పూర్తి చేయుటకు అదనంగా మరో ?.10 లక్షలు కావాలిజడ్పీ సీఈవో ను కోరిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పరిశీలించారు. ఈ పనులకు జడ్పీ నిధులు రూ.25 లక్షలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే కళాశాల చుట్టూ పూర్తిగా ప్రహరీ గోడ నిర్మించాలంటే మరో ?10 లక్షలు కావాల్సి వస్తోందని ప్రిన్సిపాల్ వెంకట సుబ్బమ్మ ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి తెచ్చారు.వెంటనే జడ్పీ సీఈవో కు ఎమ్మెల్యే ఆదిమూలం ఫోన్ చేసి పరిస్థితిని వివరించి అదనంగా రూ.10 లక్షలు విడుదల చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన జడ్పీ సీఈఓ నిధులు విడుదలకు అంగీకారం తెలిపినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు.అలాగే ఈ కళాశాలకు అదనపు తరగతి గదులు నిర్మాణానికి ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, ఆరనియార్ ఆయకట్టు సంఘం అధ్యక్షుడు రవి రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సుమాంజలి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# జాలవడిలో తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి

## - పట్టించుకోని పంచాయతీ అధికారులు- పాలకులు,



పెద్దకడుబూరు, ఏప్రిల్, 10 (శ్రీ చక్ర): పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవడి గ్రామంలో గత రెండు రోజుల నుండి గ్రామంలోని తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని త్రాగునీటి బోరు మోటర్ కాలిపోవడంతో మోటారు పూర్తిగా పాడైపోవడంతో అది పనిచేయడం లేదంటూ కొత్త మోటర్ తేవాలని మెకానిక్ లో అధికారులకు సూచించిన కొత్త మోటర్ తేవడానికి ఇప్పటికిప్పుడు పంచాయతీ నిధులు లేవంటూ రెండు, మూడు రోజులు టైం పడుతుందని పంచాయతీ అధికారులు చేతులు ఎత్తేశారు. గ్రామంలోని ప్రజలకు, గేదెలకు త్రాగునీటి ఎద్దడి సమస్య తీవ్రమవడంతో గ్రామంలోని రైతులు చేసేది లేక దూర ప్రాంతం మైన పొలాల్లో ఉన్న బోరు,బావుల దగ్గర నుండి నడుచుకుంటూ వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామంలోని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుండి గ్రామంలోని తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ గాను పంచాయతీ అధికారులు,ఈ ఓ ఆర్ డి అధికారి,ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కానీ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కూడా లేవని గ్రామంలోని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాలవడి గ్రామంలోని ప్రజలకు మాత్రం ఒక పక్క తాగునీటి సమస్య, మరోపక్క విద్యుత్ సమస్య గ్రామ ప్రజలను పట్టిపీడిస్తున్నాయని గ్రామంలోని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా ఉన్నతాధికారులు మాత్రం గ్రామంలోని ఎటువంటి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని ఆయా గ్రామాల పంచాయతీ అధికారులకు, స్పెషల్ ఆఫీసర్లకు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ గాను అవేవీ పట్టించుకోకుండా గ్రామంలోని త్రాగునీటి బోర్ మోటారు పూర్తిగా కాలిపోవడంతో దాని స్థానంలో కొత్త మోటర్ తేవడానికి ఇప్పటికిప్పుడు పంచాయతీ నిధులు లేవంటూ మేము ఏం చేయాలో మాకే తెలియదు అంటూ మాకు కొత్త మోటర్ తేవడానికి మూడు, నాలుగు రోజులు టైం పడుతుందని పంచాయతీ అధికారులు కరాకండిగా చెప్పినట్లు సమాచారం. అప్పటివరకు రైతులు గ్రామంలోని ప్రజలు, మహిళలు తీవ్రమైన త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సిందేనని గ్రామంలోని ప్రజలకు పంచాయతీ అధికారులు ఇటు పాలకులు సూచించినట్లు సమాచారం.

## గ్రామాలను పట్టిపీడిస్తున్న విద్యుత్ సమస్యలు - పట్టించుకోని విద్యుత్ అధికారులు,




పెద్దకడుబూరు, ఏప్రిల్, 10 (శ్రీ చక్ర):- పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవడి,కమ్మలదిన్నె గ్రామాలను విద్యుత్ సమస్యలు పూర్తిగా పట్టిపీడిస్తున్నాయని గ్రామంలోని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలకు పగలు,రాత్రి తేడా లేకుండా ఎప్పుడు బడితే అప్పుడు విద్యుత్ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రోజు ఉదయం 8 గంటలకు పోయిన సప్లై తిరిగి సాయంత్రం మూడు గంటల నుండి విద్యుత్ సరఫరా చేస్తే విద్యుత్ సమస్యల వల్ల గ్రామాల్లోని త్రాగునీటి సమస్య పట్టిపీడిస్తున్నాయని అన్నదాతలు,మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట తొమ్మిది గంటలకు వ్యవసాయానికి 9 గంటలు పాటు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలని కూటమి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసినప్పటికీ గాను ఇక్కడ పనిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని గ్రామంలోని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో విద్యుత్ అధికారులు గోరంగా విఫలమవుతున్నారని విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలను పునరుద్ధరించడంలో చాలా మొండి వైఖరిని అవలంబిస్తూ వారు ఆడింది ఆట పాడిందే పాట అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు త్రాగునీటికి మాత్రం విద్యుత్ సరఫరా లేక గత రెండు రోజుల నుండి గ్రామంలోని ప్రజలు విద్యుత్ సమస్య వల్ల త్రాగునీటి ఎద్దడి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని పలు గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించి హెచ్.మురవని 133/కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నుండి జాలవడి,కమ్మలదిన్నె గ్రామాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పగటిపుటే నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్తును సరఫరా చేసే విధంగా ఇక్కడ పనిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు

## సర్వేలు జాప్యం అనేది నిర్లక్ష్యం కాదు...పరిస్థితుల ప్రభావం

### సర్వేల్లో ఆలస్యం ? బాధ్యత ఎవరిది? వ్యవస్థలో లోపాలే కారణమా?

వరదయ్యపాలెం,ఏప్రిల్ 10(శ్రీచక్ర):ప్రభుత్వ పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న వివిధ సర్వేలు ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో జాప్యానికి గురవుతున్నాయి. ఈ ఆలస్యాలకు ప్రధాన కారణం సిబ్బంది కొరత మాత్రమే కాకుండా, అందుబాటులో ఉన్న సిబ్బందిపై అధిక భారం పడటం కూడా. ముఖ్యంగా వెల్ఫేర్ అసిస్టెంట్లపై మొత్తం బాధ్యత పడటం వల్ల సర్వే ప్రక్రియ మందగిస్తోంది. ఇతర విభాగాలైన జూనియర్ లైన్ మేన్, ఏఎన్ఎం లు అత్యవసర సేవలతో బిజీగా ఉండటం,డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సిబ్బంది తమ విధుల్లో నిమగ్నమవడం వల్ల సర్వేలకు సహకారం తగ్గింది. ఇక సర్వేయర్లు, విఆర్ఓ లు రీసర్వే పనుల్లో నిమగ్నమై ఉండగా, మహిళా పోలీసు సిబ్బంది డెప్యూటేషన్ డ్యూటీల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ స్థాయిలో సర్వే బాధ్యతలు దాదాపు పూర్తిగా వెల్ఫేర్ అసిస్టెంట్లపై పడుతున్నాయి. ఇది ఒక వ్యక్తి లేదా ఒకే విభాగం భుజాలపై ఎక్కువ భారాన్ని మోపినట్లే. ఫలితంగా సర్వేలు సమయానికి పూర్తికాకపోవడం సహజమే.ప్రజల పరిస్థితి కూడా సర్వే ప్రక్రియకు అడ్డంకిగా మారుతోంది. ఎక్కువ మంది ప్రజలు రోజువారీ జీవనోపాధి కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో నిమగ్నమై ఉంటారు. అందువల్ల ఆఫీస్ సమయాల్లో అందుబాటులో ఉండటం కష్టసాధ్యం. సాయంత్రం లేదా రాత్రి వేళల్లోనే వారు ఇంటికి చేరుతారు.దీంతో సర్వే సిబ్బంది కూడా అసౌకర్య సమయంలో పని చేయాల్సి వస్తోంది. ఇక ఓటీపీ (ఓటీపీ) సమస్య ప్రజల్లో భయాన్ని కలిగిస్తోంది. ప్రతి సర్వే సమయంలో పలుమార్లు ఓటీపీ చెప్పాలని కోరడం వల్ల మోసపోతామేమో అనే అనుమానం ప్రజల్లో పెరుగుతోంది. సైబర్ మోసాల నేపథ్యంలో ఈ భయం సహజమే.అధికారులు -ప్రజలు అందుబాటులోకి వస్తే అక్కడ నెట్ సేవలకు అంతరాయం కూడా జాప్యంకు కారణం అవుతుంది.ఈ పరిస్థితుల్లో ప్రజలు సర్వేలకు సహకరించడంలో వెనుకంజ వేస్తున్నారు.ఈ సమస్యలకు పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని విభాగాల సిబ్బందిని సమన్వయం చేసి, సర్వేలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. సర్వే సమయాలను ప్రజలకు అనుకూలంగా మార్చడం, ఓటీపీ అవసరాన్ని తగ్గించడం లేదా స్పష్టమైన అవగాహన కల్పించడం అవసరం. అదనంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సర్వేలను వేగవంతం చేయవచ్చు. సర్వేలు కేవలం డేటా సేకరణ కోసం కాదు, ప్రజలకు అందాల్సిన సేవల పునాది. ఈ ప్రక్రియలో లోపాలు ఉంటే, దాని ప్రభావం నేరుగా ప్రజలపైనే పడుతుంది. కాబట్టి వ్యవస్థలో మార్పులు తీసుకురావడం అత్యవసరం.

## నేడు విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు

కోట : ఏప్రిల్ 10 (శ్రీ చక్ర):కోట మండల విద్యుత్ వినియోగదారులకు తెలియజేయడమేమనగా నేడు రెండవ శనివారం అనగా 11వ తేదీన 33/11కేవి కోట మండలం లోని కొత్తపాలెం,ఉత్తమ నెల్లూరు, సిద్దవరం,వంజివాక,సబ్ స్టేషన్ పరిధిలో మరమత్తులు చేయడం జరగుతుందని కోట విద్యుత్ శాఖ ఏ ఈ అనంతరావు తెలియజేశారు.కావున ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఉంటుందని కావున మండల ప్రజలు అందరూ గమనించి సహకరించాలని కోరారు.

## సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట,ఏప్రిల్ 10(శ్రీచక్ర): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో సూళ్లూరుపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె నియోజకవర్గంలోని తడ మండలంలో విస్తృతంగా పర్యటించారు.తడ మండలంలోని కారూరు గ్రామంలో 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అలాగే తడకండ్రిగ లో రెండు సచివాలయ భవనాలు,విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. తడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం స్వచ్ఛ రథాలను జండా ఊపి ప్రారంభించారు. తడలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, 9 మంది లబ్ధిదారులకు 4,53,614 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో 15 హెల్త్ విలేజ్ క్లినిక్లు మంజూరైనట్లు తెలిపారు వాటి నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,పలువురు కూటమి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ మరో ఏడాది(2026-27)పొడిగింపు

అమరావతి,ఏప్రిల్ 10 (శ్రీచక్ర):రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం, మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను ప్రవేశపెట్టడం జరిగింది.దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు (తెరపిస్) ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది.మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నెల్లూరుపల్లి కొత్తపాలెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం

కోట : ఏప్రిల్ 10 (శ్రీ చక్ర): కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోట మండలం నెల్లూరు పల్లి కొత్తపాలెం గ్రామంలో సిడిపిఓ ముని కుమారి ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి గ్రామంలో ఉన్న తల్లులు హాజరయ్యారు.ఏప్రిల్ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఈ పోషణ్ పక్వాడ కార్యక్రమం జరుగుతున్నన్నారు.విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఫోను ఇవ్వకూడదని అదేవిధంగా టీవీలో చూసే విధానంలో తక్కువ సమయాన్ని కేటాయించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని,రెండు సంవత్సరాల వయసు వరకు మెదడు అభివృద్ధి ఎక్కువగా ఉన్నందువలన ఆహ్లాదకరమైన వాతావరణం,పోషణ విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఎం పద్మ, టాటా ట్రస్ట్ ప్రోగ్రామ్ అసోసియేట్ హైమావతి, అంగన్వాడీ వర్కర్ వై. విజయలక్ష్మి,కే.స్వాతి,సీ హెచ్. రమణమ్మ,జి.హేమలత,ఆయమ్మ లు పాల్గొన్నారు.



# స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ నందు షేక్ సైదా జన్మదిన వేడుకలు.

### షేక్.షైదా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో




మార్కాపురం ఏప్రిల్ 10 (శ్రీ చక్ర)మార్కాపురం...ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్. సైదా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ షేక్. మహబూబ్ వలీ తెలిపారు.. శుక్రవారం న షేక్ సైదా జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగుల ఆశ్రమం నందు సైదా జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ మహబూబ్ వలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.. ముందుగా మానసిక వికలాంగుల నడుమ కేక్ కట్ చేసి సైదాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ నేపథ్యంలో డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ షేక్ సైదా నాయకత్వంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నందు కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని తెలిపారు..సామాజిక సేవలో ముందుండే షేక్ సైదా భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజు వేడుకలు చేసుకోని,నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అభిలషించారు..ఈ వేడుకల్లో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్,మార్కాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాసిం వలి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

## రథోత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ మార్పులు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి




మార్కాపురం ఏప్రిల్10 ( శ్రీ చక్ర)మార్కాపురం పట్టణంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సుబ్బారావు మాట్లాడుతూ శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రేపు నిర్వహించనున్న రథోత్సవం దృష్ట్యా పట్టణంలో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. వివిధ స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డయాస్‌లు కారణంగా ప్రధాన రహదారులపై రద్దీ పెరగనుంది.ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, ఆర్టీసీ అధికారులు కలిసి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.కంభం బస్టాండు నుంచి కంభం వైపు వెళ్లే బస్సులు తర్లుపాడు మార్గం లేదా చెరువు కట్ట మీదుగా బైపాస్మార్గంద్వారామళ్లిం చబడతాయి.దోర్నాల రోడ్డు మార్గాన వెళ్లే బస్సులు కూడా చెరువు కట్ట మీదుగా బైపాస్ ద్వారా దోర్నాల వైపు మళ్లించబడతాయి.ప్రయాణికులు మరియు ప్రజలు ఈ మార్పులను గమనించి ముందస్తుగా ప్రయాణ ప్రణాళికలు చేసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్, ఆర్టీసీ అధికారులకు సహకరించాలని కోరారు.మనం అందరం కలిసి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించుకుందాం అని అధికారులు ఆకాంక్షించారు.

## ఎలక్ట్రికల్ ప్రభను ప్రారంభించిన జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి



మార్కాపురం ఏప్రిల్ 10 (శ్రీ చక్ర)మార్కాపురం శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్కాపురం పట్టణం కంభం రోడ్డు ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వద్ద జనసేన పార్టీ తరుపున ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ ప్రభను జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ పూజ నిర్వహించి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు నరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, దుగ్గి రామిరెడ్డి, బెల్లంకొండ రామకృష్ణ, ఆది నారాయణ, కంబం వెంకట రమణ, పిచ్చయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ హాల్ టికెట్లు ఇచ్చిన కాలేజీ

### కేసు నమోదు..ఒకరి అరెస్టు


గుంటూరు,విద్యార్దులు కు జే ఈ ఈ ఎగ్జామ్ లో ఫేక్ హాలిటికెట్లు ఇచ్చిన ఆక్స్ఫర్డ్ కాలేజ్ సిబ్బంది పై కేసు నమోదయింది. తమ వద్ద లక్షలు రూపాయలు తీసుకుని మోసం చేశారాని విద్యార్దులు తల్లిదండ్రులు.పోలీసులకు పిర్యాదుచేసారు. సెక్షన్.420.120(బి) 506.509.465.467 కేసు నమోదుఅయింది. ఆక్స్ఫర్డ్ డీన్ మురళి కృష్ణ పిఏ జూజీ మూర్తిని పట్టాభి పురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఈ కేసులో యాజమాన్యం ప్రిన్సిపాల్.డీన్., సి ఈ వో .సిబ్బంది ఐదుగురు పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆక్స్ఫర్డ్ కాలేజ్ విద్యార్థుల భవిష్యత్ పై విద్య శాఖ మంత్రి లోకేష్ ఆరా తీసారు. ఫేక్ హాలిటికెట్ ల ఘటన పై కలెక్టర్ సాయికాంత్ వర్మ సిరియస్ అయ్యారు. చంద్రమౌళి నగర్ లో ఉన్న ఆక్స్ఫర్డ్ కాలేజ్ పర్మిషన్ లేదని విద్యాశాఖ అధికారులు విచారణలో వెల్లడించారు.

## రథోత్సవంలో పాల్గొని చెన్నకేశవుని వైభవాన్ని తిలకించండి: డాక్టర్ ఏలూరి



మార్కాపురం ఏప్రిల్ 10 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా కేంద్రం.మార్కాపురం పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం నేడు జరగనుంది. ఈ సందర్భంగా భక్తులకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ, మార్కాపురంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది, ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్న క్షేత్రమని పేర్కొన్నారు. ఈ ఆలయం వైష్ణవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచి, భక్తుల విశ్వాసానికి నిలయంగా నిలుస్తోందని చెప్పారు. సంవత్సరాంతం భక్తులతో కళకళలాడే ఈ దేవస్థానం, ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో మరింత ఆధ్యాత్మిక వైభవంతో విరాజిల్లుతుందని తెలిపారు. రథోత్సవం సందర్భంగా స్వామి అమ్మవారు అలంకార భూషితులై రథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్య ఘట్టమని ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున రథోత్సవానికి హాజరై ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రథోత్సవంలో దివ్య దర్శనం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుందని, స్వామివారి కృపతో మోక్షసిద్ధి కలుగుతుందనే విశ్వాసం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రథోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు.

## వెంకటేశ్వరరావుకు పిహెచ్ డి అవార్డు.ప్రముఖులు చేతుల మీదుగా ప్రధానంమండలంలో పలువురు అభినందనలు



కాజులూరు, ఏప్రిల్ 10 (శ్రీచక్ర)కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన తాతపూడి వెంకటేశ్వరరావు పిహెచ్డి అవార్డును సాధించుకున్నారు. ఈమేరకు శుక్రవారం అధికవి నన్నయ యూనివర్సిటీ 16, 17 వ స్నాతకోత్సవం సందర్భంగా విసి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి అధ్యక్షతన కార్యక్రమం జరిగిగింది. ఈసందర్భంగా కాకినాడ జిల్లా కాజులూరు మండలం కుయ్యేరు గ్రామం నుండి తాతపూడి వెంకటేశ్వరరావుకు పిహెచ్.డి. అవార్డుఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, నుండి సాధించుకున్నారు.ఈసందర్భంగా శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ , జాతీయ భద్రతా మండలి సలహాదారులు మహేంద్ర పిలామా, ఏపీ ఎస్ సి హెచ్ ఈ,చైర్మెన్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి, ప్రధానమంత్రి అనుబంధ కళాశాల కాకినాడలో పి.ఆర్.గవర్నమెంట్ కళాశాల (అటానమస్ ) నుండి మొట్టమొదటి పిహెచ్.డి. అవార్డును వెంకటేశ్వరరావు వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం. 141 సంవత్సరాల చరిత్ర కలిగిన పిఆర్ గవర్నమెంట్ కాలేజీ కి, జువాలజీ విభాగంకి మొట్టమొదటి డాక్టరేట్ అవార్డు తాతపూడి వెంకటేశ్వరరావు పూర్తి చేశారని ఈసంధర్భంగా పేర్కొన్నారు. “ఆంధ్రప్రదేశ్‌లోని “కాకినాడ బే” లోని స్టేబుల్ కార్బన్, నైట్రోజన్, ఐసోటోపిక్ సిగ్నేచర్లు,పార్టిక్యులేట్ ఆర్గానిక్ మ్యాటర్, (పిఓఎమ్) జూప్లాంక్టాన్ విశ్లేషణ” అనే అంశంపై పిహెచ్. డి. చేశారని ఈసందర్భంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు .”కాకినాడ బే “లోని 11 స్టేషన్లలో మూడు సంవత్సరాల పాటు పరిశోధన చేసి కార్బన్-నైట్రోజన్ ఐసోటోప్ స్టడీస్ ద్వారా ట్రోఫిక్ డైనమిక్స్, ఫుడ్ వెబ్ ఎనర్జీ లెవెల్స్ ఎలా ట్రాన్స్‌ఫర్ అవుతాయో అనేది విశ్లేషించారని పేర్కొన్నారు. జువాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎన్. శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పిహెచ్.డి. పూర్తి చేశారని తెలిపారు. వెంకటేశ్వరావు తండ్రి వాడపల్లి , తల్లి రత్నమ్మ ఆశయం మేరకు కష్టపడి చదివి ఈ అవార్డును సాధించినందుకు తనకు చాలా ఆనందంగా ఉందని వెంకటేశ్వరరావు సందర్భంగా పేర్కొన్నారు. వెంకటేశ్వరరావు అవార్డు సాధించినందుకు , కుటుంబ సభ్యులు,బంధువులు ,మండలంలో పలువురు ప్రముఖులు స్నేహితులు మిత్రులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

## రామచంద్రపురం పట్టణ వాసి ఆదిత్య వర్ధన్ కు గోల్డ్ మెడల్ .గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రధానం






రామచంద్రపురం, ఏప్రిల్ 10 (శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణానికి చెందిన గోదావరి కవి డా .ర్యాలి శ్రీనివాసు తనయుడు ఆదిత్యవర్ధన్ ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం నుండి బంగారు పతకం అందుకున్నారు. ఈ పతాకాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా శుక్రవారం నన్నయలో వైస్ ఛాన్సలర్ ఎస్ ప్రసన్నశ్రీ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవం అందుకున్నారు. 2022-2023 వ సంవత్సరానికి బి టెక్ కంప్యూటర్ సైన్స్ నుండి టాపర్ గా నిలిచి బంగారు పతకాన్ని ఆదిత్య వర్దన్ దక్కించుకున్నారు.ఇదిఇలాడండగా ఆదిత్యవర్ధన్ హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నారు. ఆదిత్య వర్ధన్ రామచంద్రపురం పట్టణంలో గల మోడ్రన్ లో ఇంటర్ పూర్తిచేసి టెన్ బై టెన్ మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ఈసందర్భంగా మోడ్రన్ సంస్థల అధినేత జి వి రావు ఆదిత్య వర్దన్ కు అభినందనలు తెలిపారు. అలాగే కుటుంబ సభ్యులు, పట్టణంలో పలువురు ప్రముఖులు,మిత్రులు ఈ సందర్భంగా ఆదిత్య వర్దన్ కు అభినందనలు తెలియజేశారు.

## శ్రీ భీమేశ్వర స్వామి అంతరాలయంలో హుండీ లెక్కింపు.జిల్లా సహాయ కమిషనర్ ప్రత్యేక ఆదేశాలతో లెక్కింపు.45, 160 రూపాయలు ఆదాయం

రామచంద్రపురం, ఏప్రిల్ 10 (శ్రీచక్ర)దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ దాక్షారామం మాణిక్యంబ సమేత భీమేశ్వర స్వామి అంతరాలయంలో జిల్లా సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేకించి ఉందిని లెక్కించారు. ఈ మేరకు శుక్రవారం ఈ విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ , కార్యనిర్వహణాధికారిణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానము నందు ప్రతినిత్యం జరుగు సేవలలో భాగంగా 9వ తేదీ గురువారం రాత్రి 7 గంటల 30 నిమిషాలకు జరిగిన స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ధూపం ఇచ్చే సమయంలో అగ్గి రవ్వలు ఎగిరి హుండీలో పడటంతో అక్కడ ఉన్న అర్చక స్వాములు గమనించి నోట్లు పాడైపోతాయని ఉద్దేశంతో హుండీలో నీరు వేసి హుండీలో ఉన్న నోట్లు అగ్గి రవ్వల కారణంగా పాడవకుండా కాపాడగలరు. దీంతో విషయం జిల్లా సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్వామివారి అంతరాలయంలో ఉండే హుండీని ఆయన ఆదేశముల మేరకు 10వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2-30 నిమిషాలకు హుండీ తెరచి ఆదాయం లెక్కించారు. ఈ కార్యక్రమాన్ని వెల్ల గ్రూప్ కార్యనిర్వాహణాధికారి వైవివి సత్యనారాయణ , అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీ ని లెక్కించగా 45,వేల 160 రూపాయలు వచ్చిన్నా ఆలయ సహాయ కమిషనర్ ,కార్యనిర్వాహణ అధికారిణి అల్లు వెంకట దుర్గా భవాని తెలియజేసారు.




## యువకుడికి చేయూతనిచ్చిన టిడిపి నేత మాకం అబ్రహం



మార్కాపురం ఏప్రిల్ 10 తిశ్రీ చక్రం)మార్కాపురం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మాకం అబ్రహం దాతృత్వానికి పలువుర ప్రశంసిస్తున్న .సంఘటన. వెలుగులోకి వచ్చింది. మార్కాపురం మండలం చింతకుంట గ్రామానికి చెందిన .రెడ్డేపోగుకాసయ్యఅనేయువకుడు బాడుగకు ఆటో తోలుతూ. కుటుంబాన్నిపోషిస్తూకష్టపడేవాడు.అంతేకాకుండా గ్రామానికి చెందిన టిడిపి నేత అబ్రహం కు చేదోడు వాదోడుగా ఉంటూ పార్టీకి నమ్మకంగా ఉండేవాడు.దీనితో యువకుడికి ఏదో ఒక సహాయం చేయాలని ఉద్దేశంతో ఈరోజు అతను చేస్తున్న వృత్తికి పనికొచ్చే విధంగా సుమారు మూడు లక్షల రూపాయలు విలువచేసే మొత్తం ఖర్చు అబ్రహామే తానే భరిస్తూ ఒక ఆటో అతనికి తీసి ఇవ్వడం జరిగింది. దీనితో మండల లోని పలువురు టిడిపి నేత అబ్రహం చూపిన దాతృత్వానికి ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితేఅబ్రహంమాత్రం మా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆశయాలకు, ఆలోచనలకు, అనుగుణంగా, పనిచేస్తున్నామని చెప్పడం విశేషం..ఈ కార్యక్రమంలో చింతకుంట్ల గ్రామానికి చెందిన టిడిపి యువత పాల్గొన్నారు.

## నేడు ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం.



కాజులూరు, ఏప్రిల్ 10( శ్రీచక్ర)శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గం”ల వరకు 33/11కేవీ కుయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలో గల 11కేవీ దుగ్గుదుర్రు ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయునన్నట్లు. ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎన్నో ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో దుగ్గుదుర్రు ,దుగ్గుదుర్రు పాటి, మేకలగరువు ,ఉప్పుమిల్లి ,చింతల్లంక,రేగుబడవ గ్రామాల తోపాటు ఇండస్ట్రియల్ ,ఆక్వా ఏరియాలకు లైన్ల మరమత్తుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయిదురని పేర్కొన్నారు .కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉదయ భాస్కర్ పేర్కొన్నారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా దర్భగూడెంలో ఘనంగా జన్మదిన వేడుకలు



జీలుగుమిల్లి ఏప్రిల్ 10 (శ్రీ చక్ర,)ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని దర్భగూడెం గ్రామంలో సీనియర్ టిడిపి యువ నాయకుడు ముప్పిడి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువ నాయకుడిగా గుర్తింపు పొందిన పుట్టా మహేష్ కుమార్ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి వర్గం ప్రజలకు చేరువయ్యారని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ప్రాంతాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అలవాల రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు పీతల వెంకటేశ్వరరావు, కార్యదర్శి జంగా చిన్ని, జుజ్జవరపు నరసింహమూర్తి, పంపన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పీతల నాగేశ్వరావు, పైడిమాల కృష్ణ, కలపాల శ్రీను, రాయల యేసు, పిళ్లెం వెంకయ్య, యరమాల సురేష్, పంపన శ్రీను, నవీన్, యర్రగొల్ల రాజు, కుటుంబరావు, అలవాల పండు, గోలి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బచ్చలి కూర పెరటి మొక్కే కావచ్చు..

## దీని లాభాలు తెలిస్తే అస్సలు వదలరు!



ఆకుకూరల్లో రారాజు అనగానే వెంటనే గుర్తొచ్చేది పాలకూర. అయితే, పోషకాల విషయంలో దానికి ఏమాత్రం తీసిపోనిది, మన పెరట్లో పెరిగే బచ్చలికూర. చాలామంది దీనిని సాదాసీదా ఆకుకూరగా భావిస్తారు. కానీ, బచ్చలి కూరలో ఉన్న పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బచ్చలి కూర రెండు రకాలు. తీగ బచ్చలి, కాడ బచ్చలి. ఎక్కువగా కాడ బచ్చలి మనకి దొరుకుతుంది. తీగ బచ్చలిని ఇంటి పెరట్లో పెంచుకోవచ్చు. బచ్చలి కూరతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.

1. రక్త హీనతకు దివ్య ఔషధం:
రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారు, నీరసంగా ఉన్నవాళ్లు బచ్చలి కూరను డైట్‌లో చేర్చుకుంటే ఎంతో మంచిది. ఇందులో ఉండే ఐరన్ కంటెంట్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచి, రక్తహీనత సమస్యను దూరం చేస్తుంది.

2. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది:
బచ్చలికూరలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని వదిలించి, జీర్ణక్రియను సాఫీగా చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు పంపడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

3. కంటి చూపు పదిలం:
కంప్యూటర్లు, ఫోన్లు బాగా వాడే వారికి కళ్లు త్వరగా అలసిపోతాయి. అలాంటి వారు బచ్చలి కూర డైట్‌లో చేర్చుకుంటే ఎంతో మంచిది. దీనిలో ఉండే విటమిన్ ఎ, బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. రేచీకటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి.

4. ఎముకల బలం:
వయసు పెరిగే కొద్దీ వచ్చే ఎముకల బలహీనతను తగ్గించడంలో బచ్చలి కూర తోడ్పడుతుంది. ఇందులో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఉక్కులా మారుస్తాయి.

5 చర్మ సౌందర్యం:
ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ముడతలు రాకుండా నివారించి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.



# తగినంత నిద్ర లేకపోతే ఈ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందా..!



ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి, మొబైల్ వ్యసనం, మారుతున్న జీవనశైలి కారణంగా చాలా మందికి సరిపడా నిద్ర లేకుండా పోయింది. అందువల్ల ఆలస్యంగా నిద్రపోవడం, త్వరగా మేల్కొనడం, నిద్ర సమయాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైపోయింది. అయితే.. తగినంత నిద్ర(రోజుకు 7-9 గంటలు) లేకపోతే శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నిద్ర లేకపోవడం వల్ల వచ్చే వ్యాధులు

నిద్ర లేకపోవడం కారణంగా రక్తపోటు పెరిగిపోవచ్చు. ఇది గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. దీర్ఘకాలిక నిద్ర లేమి గుండెపోటు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

నిద్రలేమి చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. దీంతో డయాబెటిస్ రిస్క్ పెరుగుతుంది.

నిద్ర లేకపోవడం వలన జీవక్రియ మందగిస్తుంది. దానివల్ల బరువు పెరుగుతారు.

నిద్రలేమి.. ఆందోళన, నిరాశ, డిప్రెషన్ వంటి మానసిక




సమస్యలను మరింత పెంచుతుంది.

నిద్రలేమి క్రమంగా రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. ఇది పలు ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది.

బాగా నిద్రపోవాలంటే..

ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. పడక గదిని చీకటిగా, ప్రశాంతంగా ఉంచుకోవాలి. పడుకునే ముందు 1-2 గంటల పాటు మొబైల్/టీవీకి దూరంగా ఉండాలి. వీలైనంత వరకూ కెఫీన్(కాఫీ/టీ) వంటి వాటిని తగ్గించడం మంచిది.


# రోజూ స్కిప్పింగ్ చేయడం మంచిదేనా?




ఇటీవలి కాలంలో మన జీవనశైలి చాలా మారిపోయింది. సమయానికి తినకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం, మరికొన్ని అనారోగ్యకరమైన అలవాట్లు ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. అయితే, ఆరోగ్యంగా ఉండటానికి శారీరక శ్రమ చాలా ముఖ్యం. రోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు.

గుండెఆరోగ్యం మెరుగుపడుతు ంది..

స్కిప్పింగ్ చేయడం వల్ల గుండెకు సంబంధించిన కండరాలు బలపడతాయి. ఇది గుండెకి అవసరమైన ఆక్సిజన్, పోషకాలు అందించే రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. తద్వారా గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది.



బరువు తగ్గడంలో



సహాయపడుతుంది..

స్కిప్పింగ్ బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. ఈ వ్యాయామం మీ జీవక్రియను పెంచుతుంది.

ఎముకలు బలపడతాయి..

రోజూ స్కిప్పింగ్ చేయడం వల్ల



కాళ్లు, తొడలు, భుజాలు, చేతులు వంటి కండరాలు బలపడతాయి. ఇది ఆస్టియోపోరోసిస్, పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బలహీనమైన కండరాలు ఉన్నవారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

డయాబెటిస్ నియంత్రణ..

స్కిప్పింగ్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇంకా, నిద్రలేమితో బాధపడేవారు కూడా రోజూ




స్కిప్పింగ్ చేయడం వల్ల మంచిగా నిద్రపోతారు.

ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది..

మీరు చిన్న విషయానికి కూడా ఒత్తిడికి గురైతే.. రోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేస్తే ఉపశమనం కలుగుతుంది.. ఇది శరీరంలో ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. ఈ వ్యాయామం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచి, మనస్సును ప్రశాంతపరచడంలో సహాయపడుతుంది.అంతేకాదు, స్కిప్పింగ్ మీ శక్తిని పెంచడంతో పాటూ అలసటను తగ్గిస్తుంది. రోజూ శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. ఈ విధంగా రోజూ స్కిప్పింగ్ చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.



# రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగితే.. జ్ఞాపకశక్తి మరింత మెరుగుపడుతుందా?



**ఉదయం నిద్ర లేవగానే కాఫీ తాగేవారు చాలా మంది ఉంటారు. కాఫీ తాగితే ఆరోగ్యానికి మంచిదని రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగుతారు. అయితే, రోజూ ఇలా కాఫీ తాగడం ఆరోగ్యానికి మంచిదేనా? 2-3 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే ఏం జరుగుతుంది? ఈ విషయంపై తాజా అధ్యయనం ఏం చెబుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.. తాజా అధ్యయనంలో, రోజుకు 2-3 కప్పుల కాఫీ తీసుకోవడం వల్ల చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గిపోతుందని తేలింది. అలా అని.. రోజుకు 2-3 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే అదనపు ఆరోగ్య ప్రయోజనాలు ఏవీ ఉండవని స్పష్టం చేసింది. 43 సంవత్సరాల వయసున్న 1,31,821 మందిని అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు, 2-3 కప్పుల కాఫీ తాగేవారిలో అభిజ్ఞా సామర్థ్యం మెరుగుపడిందని కనుగొన్నారు. అయితే, కేవలం కెఫిన్ ఉన్న కాఫీ తాగిన వారికి మాత్రమే ఈ ప్రయోజనం ఉందని, కెఫిన్ లేని కాఫీ తాగిన వారికి ఉండదని స్పష్టం చేసింది.ఈ అధ్యయనం ప్రకారం, పదేళ్ల పాటు రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగిన వ్యక్తుల్లో చిత్తవైకల్యం రాకుండా ఉండే ప్రమాదం 20% తగ్గింది. అలాగే, 1-5 కప్పుల కాఫీ తాగేవారికి చిత్తవైకల్యం వచ్చే ప్రమాదం 15% తక్కువగా ఉంటుందని అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో మహిళలు, పురుషుల గురించి కూడా సర్వే నిర్వహించారు.**

# చిన్న పిల్లలను వీటికి దూరంగా ఉంచండి.. లేదంటే చాలా ప్రమాదం.!

ఇటీవలి కాలంలో పిల్లల్ని పెంచడం తల్లిదండ్రులకు పెద్ద సవాల్‌గా మారింది. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఎన్నో అనర్థాలు జరిగే అవకాశముంటుంది. బిజీ లైఫ్ స్టైల్ కారణంగా పిల్లల్ని పెంచే విషయంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లల్ని అర్థం చేసుకుని పెంచడమే కాదు.. వారి విషయంలో తగు జాగ్రత్తలు పాటించడం కూడా ముఖ్యమే.

1. ఊపిరాడకుండా చేసే వస్తువులు:చిన్న పిల్లలకు.. నాణేలు, బటన్లు ఇతర చిన్న చిన్న వస్తువులు గొంతులో ఇరుక్కునే ప్రమాదం ఉంది. వాటిని పిల్లలకు దగ్గరగా ఉంచకూడదు. ప్లాస్టిక్, చెక్కబొమ్మలు కొనేటప్పుడు వయసు పరిమితి తప్పకుండా చూడాలి. వాటితో గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

2. విషపూరితమైన పదార్థాలు:రంగు రంగుల మాత్రలను చూడగానే ఆకర్షితులయ్యే పిల్లలు వెంటనే వాటిని నోట్లో వేసుకునే ప్రయత్నం చేస్తుంటారు. అది చాలా ప్రమాదకరం.. కాబట్టి మెడిసిన్స్ దూరంగా ఉంచాలి. క్లీనింగ్ లిక్విడ్స్ అంటే ఫ్లోర్ క్లీనర్లు, డిటర్జెంట్లు, ఫినాయిల్ బాటిళ్లను ఎత్తులో లేదా లాక్ చేసిన అల్మారా వంటి వాటిలో ఉంచాలి. నెయిల్ పాలిష్, పెర్ఫ్యూమ్స్ వంటివి కూడా డేంజరే కాబట్టి వాటినీ దూరంగా ఉంచడం ఉత్తమం.3. పదునైన, ఎలక్ట్రానిక్ వస్తువులు:కత్తులు, కత్తెరలు మొదలగు పదునైన వస్తువులను ఎట్టిపరిస్థితుల్లో పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు. వీటివల్ల చాలా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువులనూ పిల్లలకు చేరువలో ఉంచకూడదు. ప్లగ్ పాయింట్లు.. పిల్లలకు అందేంత ఎత్తులో ఉంటే వాటికి తప్పనిసరిగా సేఫ్టీ కవర్లు వాడాలి. లేదంటే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంటుంది. అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి వాటినీ దూరంగా ఉంచాలి.

# ఫిట్‌గా ఉండేందుకు ఎలాంటి డైట్ ఫాలో కావాలంటే.?

పతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. కానీ డైట్ విషయంలో సరైన శ్రద్ధ చూపరు. ఫిట్‌గా ఉండటం అంటే తక్కువ తినడం మాత్రమే కాదు, సరైన పోషకాలు ఉన్న ఆహారాన్ని సరైన పరిమాణంలో తీసుకోవాలి. మంచి నిద్ర, రోజూ వ్యాయామం తప్పనిసరి అంటున్నారు వైద్య నిపుణులు. ఫిట్‌గా ఉండాలంటే.. పాలు, అరటిపండు, ఖర్జూరాలు, పండ్లు, ఓట్స్ వంటి ఆహారాలు తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

టీ20 ప్రపంచ కప్ 2026: చెలరేగిన ఐర్లాండ్ బ్యాటర్లు.. ఒమన్ టార

1. కూరగాయలు, పండ్లు:రోజూ కనీసం రెండు రకాల పండ్లు, ఆకుకూరలు మీ ఆహారంలో ఉండేలా చూసుకోండి. వీటిలో ఉండే ఫైబర్(పీచు) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

2. నీరు:శరీరం ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నీరు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి, కండరాల పనితీరును పెంచి, అలసటను తగ్గించి, విష పదార్థాలను బయటకు పంపుతుంది.

3. జంక్ ఫుడ్‌కు దూరం:ప్రస్తుతం బిజీ లైఫ్‌లో చాలా మంది ఇన్‌స్టంట్ ఫుడ్‌పై ఆధారపడుతున్నారు. జంక్ ఫుడ్ అంటే పిజ్జా, బర్గర్లు, సమోసాలు, ఫ్రైడ్ రైస్, మంచూరియా, నూడుల్స్ వంటి నూనెలో వేయించిన పదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇంకా.. స్వీట్లు, కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన ఐటమ్స్(చిప్స్), ఇతర పానీయాలు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు



వస్తుంటాయి. ఫిట్‌గా ఉండలేరు.

4. తినే పద్ధతి:ఉదయం వ్యాయామం చేసిన తర్వాత అల్పాహారం తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు. ఇది రోజంతా మీకు శక్తినిస్తుంది. రాత్రి పడుకోవడానికి 2-3 గంటల ముందే భోజనం చేయాలి. రాత్రి పూట తేలికపాటి ఆహారం తీసుకుంటే చాలా మంచిది. రోజుకు ఒకేసారి ఎక్కువగా తినకుండా.. కనీసం 5-6 సార్లు తక్కువ మోతాదులో తినడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది.

5. కొబ్బరి నీళ్లు, మజ్జిగ:కూల్ డ్రింక్స్, షుగర్ ఉన్న జ్యూస్‌లకు బదులుగా కొబ్బరి నీళ్లు తాగితే మంచిది. ఇందులో ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా ఉంటాయి. జీర్ణక్రియకు, చలువ చేయడానికి మజ్జిగ ఎంతో మంచిది. మెటబాలిజంను పెంచి కొవ్వు కరగడానికి గ్రీన్ టీ ఎంతగానో సాయపడుతుంది.




# అలెన్ క్యాచ్ వివాదం.. మా ఓటమికి అదే కారణం కాదు: కేకేఆర్ ప్లేయర్ పావెల్

ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆఖరి బంతి వరకు పోరాడి 3 వికెట్ల తేడాతో లఖ్‌నవూ గెలిచింది. అయితే ఈ మ్యాచ్‌లో కేకేఆర్ ఓపెనర్ ఫిల్ అలెన్ ఔటైన తీరు వివాదాస్పదమైంది. ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో బౌండరీ లైన్ వద్ద దిగ్వేశ్ సింగ్ క్యాచ్ పట్టాడు. అది బౌండరీ లైన్‌ను తాకినట్లు కేకేఆర్ అభిమానులు ఆరోపిస్తున్నారు. ఫీల్డ్ అంపైరే నిర్ణయం తీసుకోవడంపైనా విమర్శలు వచ్చాయి. వీటిపై కేకేఆర్ ప్లేయర్ రోవ్‌మన్ పావెల్ మాట్లాడాడు.'ఫిన్ అలెన్ క్యాచ్





విషయంలో అంపైర్లు నిశితంగా పరిశీలించాల్సింది. అలెన్ ఔటై డగౌట్‌కు వచ్చాక మేం ఈ విషయం గురించి మాట్లాడుకున్నాం. ఐపీఎల్‌లోని ఫీల్డ్ అంపైర్లు ప్రతి చిన్న విషయానికీ థర్డ్ అంపైర్‌కు సిఫార్సు చేస్తుంటారు. కానీ ఈ విషయంలో మాత్రం పట్టించుకోలేదు. ఇది కచ్చితంగా అంపైర్ల నుంచి జరిగిన పొరపాటే. అయితే మేం ఈ మ్యాచ్‌లో ఓడిపోవడానికి కారణమదే అని మాత్రం చెప్పబోం. హోం గ్రౌండ్‌లో రెండు పాయింట్లను కోల్పోవడం నిరుత్సాహానికి గురిచేసింది. భారీగా ప్రేక్షకులు మద్దతుగా నిలిచిన ఈ మైదానంలో గెలిచి ఉంటే.. ఆ అనుభూతే వేరుగా ఉండేది. కానీ అలా జరగలేదు. మేం 181 పరుగుల స్కోర్ చేసినప్పుడు తప్పకుండా విజయం సాధిస్తామనే భావించాం. కానీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ ప్లేయర్ ముకుల్ చౌదరి మా నుంచి గెలుపును లాగేసుకున్నాడు. ఈ విజయం క్రెడిట్ అతడికే దక్కాలి' అని పావెల్ వివరించాడు.'తొలి విజయాన్ని నమోదు చేయబోతున్నామనే ఆనందంతో ఉండిపోయాం. కానీ ఈ మ్యాచ్‌లో మాకు కాస్త అదృష్టం కలిసి రాలేదు. మా డెస్టినీ మా చేతుల్లోనే ఉంది. మాకు ఇంకా చాలా మ్యాచ్‌లు ముందున్నాయి. ఒక్కసారి విజయాల బాట పడితే చాలు. ఇప్పుడు లఖ్‌నవూతోనూ మంచి గేమ్ ఆడాం. కానీ గెలవలేకపోయాం. ఇంకా మెరుగ్గా శ్రమించి ఆడతాం. ఆఖరి ఓవర్లో బంతిని కాస్త దూరంగా వేయాలని ప్లాన్ చేసుకున్నాం. ముకుల్ షార్ట్ పిచ్ బంతులనూ బాగా ఆడాడు. దీంతో వైడ్ యార్కర్లను ట్రై చేస్తే ఫలితం వస్తుందని భావించాం. కానీ ముకుల్ మాకు అస్సలు ఛాన్స్ ఇవ్వలేదు' అని పావెల్ తెలిపాడు.

# విధ్వంసకర విన్యాసాల వీరుడు.. అసలెవరీ ముకుల్ చౌదరి!

ఐపీఎల్.. ప్రతి ఏడాది సరికొత్త ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే ఓ అద్భుతమైన ప్లాట్‌ఫారమ్. ఎంతోమంది యువ ప్లేయర్లను వెలుగులోకి తెచ్చిన ఘనత ఈ లీగ్‌ది! దీనికి సరికొత్త ఉదాహరణ.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కుర్రాడు ముకుల్ చౌదరి. 27 బంతుల్లోనే 54 పరుగులు నాటౌట్.. ఇందులో ఏకంగా 7 సిక్సర్లు! కోల్‌కతా నైట్ రైడర్స్ గెలుపు ఖాయమని అనుకుంటున్న సమయంలో ఎల్ఎస్‌జీకి హీరోగా వచ్చాడు ముకుల్. పరుగుల దాహంలో విరాట్ కోహ్లీ.. ఫినిషర్‌లో ధోనిని తలపించేలా అద్భుతమైన షాట్లతో విరుచుకుపడుతూ.. కేకేఆర్ నుంచి గెలుపును సరదాగా లాగేసుకున్నాడు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాడు. మరి ఇంతకీ ఎవరీ ముకుల్ చౌదరి..!!ఈ 22 ఏళ్ల ముకుల్ చౌదరి స్వస్థలం రాజస్థాన్. తన కొడుకు క్రికెటర్ అవ్వాలని ముకుల్ తండ్రి ఎన్నో కలలు కనేవాడు. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్నతనం నుంచే ఆ దిశగా నడవలేకపోయాడు. ఎలాగైనా తన కుమారుడిని క్రికెటర్‌ని చేయాలనే పట్టుదలతో ముకుల్ తండ్రి.. తమ ఇంటినే అమ్మేసి ఎస్‌బీఎస్ అకాడమీలో చేర్పించాడు. అప్పటికి ముకుల్ వయసు 12 ఏళ్లు. అక్కడే దాదాపు ఐదేళ్లు శిక్షణ తీసుకున్నాడు. అక్కడ నుంచి జైపూర్ వెళ్లి నాలుగేళ్లపాటు ప్రాక్టీస్ చేశాడు. ఓసారి అండర్ 19 మ్యాచులో యూపీపై తన ఆటను చూసిన తర్వాత ముకుల్ తండ్రికి భరోసా వచ్చిందట. 2026 ఐపీఎల్ మినీ వేలంలో ముకుల్ బేస్ ప్రైజ్ రూ.30 లక్షలు. అతడిని లఖ్‌నవూ ఫ్రాంచైజీ ఏకంగా రూ.2.60కోట్లకు కొనుగోలు చేసింది.ఐపీఎల్‌లో ఇంత మంది ప్లేయర్లు ఉన్నప్పటికీ ఫినిషర్ అంటే ముందుగా ధోనినే గుర్తొస్తాడు. అయితే ఫినిషర్‌గా మ్యాచ్‌ను గెలిపించాలంటే తీవ్ర ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుంది. అలాంటి పాత్రలో



వచ్చిన ముకుల్.. అద్భుతం చేసి చూపించాడు. 182 పరుగుల లక్ష్య ఛేదనలో 8వ వికెట్‌కు అవేశ్ ఖాన్‌తో కలిసి 24 బంతుల్లో 54 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అందులో ముకుల్ 21 బంతుల్లో 52 పరుగులు బాదేశాడు. అయితే ముకుల్ చౌదరికి ధోని అంటే చాలా ఇష్టమట. ధోనినే రోల్ మోడల్‌గా తీసుకుని క్రికెట్ అరంగేట్రం చేశాడట. అయితే ముకుల్ కూడా వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కావడం కొసమెరుపు. ఈ మ్యాచ్‌లోనూ ధోనిలా 'హెలికాప్టర్ షాట్'తో సిక్స్ బాదడం.. చివరి ఓవర్లో ఏకంగా రెండు సిక్సర్లు బాది జట్టును గెలిపించి సంచలనంగా మారాడు.ముకుల్ చౌదరి విధ్వంసంపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ స్పందించాడు. 'డేటా అనలిస్ట్ శ్రీనివాస్ సూచనలతోనే ముకుల్ చౌదరిని జట్టులోకి తీసుకున్నాం. ఈ కుర్రాడిలో ఉన్న ప్రతిభను ముందుగానే గుర్తించాం. అతడిని తీసుకోవడం మా అదృష్టం. ముకుల్ వికెట్ల మధ్య పరుగెడుతుంటే విరాట్ కోహ్లీనే గుర్తొచ్చాడు. కోహ్లీలానే ముకుల్ కూడా మంచి రన్నర్. ఇలాంటి విజయాలు జట్టుకు కొత్త నమ్మకం ఇస్తాయి. చిన్న వయసులోనే ఇంత పెద్ద బాధ్యత తీసుకుని గెలిపించడం గొప్ప విషయం' అని అన్నాడు.

# మామూలోడు కాదు.. ధోనీ గుర్తొచ్చాడు: సునీల్ గవాస్కర్

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ యువ బ్యాటర్ ముకుల్ చౌదరిపై ప్రశంసల వర్షం కురిపించారు. ముకుల్ చౌదరి కేవలం 27 బంతుల్లోనే 7 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తీరును సునీల్ గవాస్కర్ కొనియాడారు. "ప్రతిరోజూ ఐపీఎల్‌లో ఓ కొత్త మెరుపును చూస్తున్నాం. ముకుల్ వంటి యువ ఆటగాడు ఏ మాత్రం భయం లేకుండా, ఒత్తిడిలో తన జట్టును గెలిపించడం అద్భుతం. రాజస్థాన్ తరఫున దేశవాళీ క్రికెట్లో 5వ స్థానంలో బ్యాటింగ్ చేసే ఈ కుర్రాడు.. ఐపీఎల్‌లోకి వచ్చి రాత్రికి రాత్రే అందరూ తన గురించి మాట్లాడుకునేలా చేసుకున్నాడు" అని సునీల్ గవాస్కర్ ప్రశంసించారు.ముకుల్ చౌదరి బ్యాటింగ్‌లో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని సునీల్ గవాస్కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత ముకుల్ చౌదరి కాసేపు సమయం తీసుకుని.. సెట్ అయిన తర్వాత బాల్స్‌ను స్టేడియం బయటకు పంపడం మెచ్చుకోదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ముకుల్ చౌదరి ఆడిన హెలికాప్టర్ షాట్ చూస్తుంటే ఎంఎస్ ధోనీ పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయని గవాస్కర్ అన్నారు. తనకు షాట్లు





కొట్టగలననే నమ్మకం ఉండబట్టే ముకుల్ చౌదరి సింగిల్స్ తీయడానికి నిరాకరించి జట్టును గెలిపించాడని పేర్కొన్నారు.లక్నో జట్టుకు ఈ విజయం చాలా కీలకమని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. మిచెల్ మార్ష్, ఎయిడెన్ మార్క్రమ్, రిషబ్ పంత్, నికోలస్ పూరన్ వంటి ప్రధాన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. యువ ఆటగాళ్ల అండతో లక్నో గట్టెక్కిందని చెప్పారు. గత సీజన్లో కేవలం స్టార్ ప్లేయర్లపైనే ఆధారపడిన లక్నో.. ఈ సారి వారు విఫలమైనా గెలవగలిగే సత్తా చాటుకోవడం ఆ జట్టుకు సానుకూల అంశమని సునీల్ గవాస్కర్ విశ్లేషించారు.లక్నో విజయం సాధించినప్పటికీ.. నికోలస్ పూరన్ ఆటతీరుపై సునీల్ గవాస్కర్ మండిపడ్డారు. "పూరన్ ఫామ్ లక్నోకు ఆందోళన కలిగించే విషయం. కేకేఆర్ మ్యాచ్‌లో అతను బంతిని సరిగ్గా హిట్ చేయలేకపోయాడు. ప్రతి బంతిని బాదాలనే ప్రయత్నంలో నికోలస్ పూరన్ అవుట్ ఆఫ్ టచ్‌గా కనిపించాడు. మనం చూసిన విధ్వంసకర పూరన్ ఇతను కాదు. లక్నో జట్టు యాజమాన్యం పూరన్‌లో తిరిగి ఆత్మవిశ్వాసం నింపే మార్గాన్ని వెతకాలి" అని సునీల్ గవాస్కర్ సూచించారు.మొత్తానికి ముకుల్ చౌదరి రూపంలో ఐపీఎల్ 2026 ఓ కొత్త ఫినిషర్‌ను కనుగొందని సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు. ఈ యువ ఆటగాడి పోరాట పటిమ చూస్తుంటే భవిష్యత్తులో ముకుల్ చౌదరి లక్నో జట్టుకు వెన్నెముకగా మారే అవకాశం ఉందని ముకుల్ చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ మ్యాచ్ రిపోర్ట్, గవాస్కర్ చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.


# నా కొడుకు జీవితం నాశనం చేస్తున్నానని తిట్టారు.. ముకుల్ తండ్రి భావోద్వేగం



ప్రస్తుతం సోషల్ మీడియాలో ముకుల్ మేనియా నడుస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆఖరి బంతి వరకు పోరాడి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు సంచలన విజయాన్ని అందించాడు 22 ఏళ్ల ముకుల్ చౌదరి. లఖ్‌నవూకు దాదాపు ఓటమి ఖాయం అనుకున్న సమయంలో క్రీజులోకి వచ్చి విధ్వంసం సృష్టించాడు. 8వ వికెట్‌కు అవేశ్ ఖాన్‌తో కలిసి ఏకంగా 54 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇందులో 21 బంతులు ముకులే ఆడేశాడు. ఈ సంచలన ఇన్నింగ్స్‌ను తన తండ్రికే అంకితం చేస్తున్నట్లు ముకుల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ముకుల్ తండ్రి దిలీప్ చౌదరి తన కొడుకు ఆడిన తీరుపై స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యాడు. తన కొడుకు క్రికెటర్ అవ్వడం కోసం ఓ తండ్రి చేసిన త్యాగాల కథ ఇప్పుడు ప్రతి హృదయాన్ని కదిలిస్తోంది.'నా కొడుకును క్రికెటర్ చేయాలన్న కల ఇప్పటిది కాదు. నాకు పెళ్లి కాకముందు నుంచే నాకు కొడుకు పుడితే క్రికెటర్‌ను చేస్తానని కలలు కనేవాడిని. ఆ కలను నిజం చేయడానికి ఎంతటి కష్టాన్ని అయినా భరించాలని సిద్ధపడ్డాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా మా ఇంటిని అమ్మేశాం. దాదాపు రూ.21 లక్షలు వచ్చాయి. కానీ ముకుల్ క్రికెటర్ అవ్వడానికి ఆ డబ్బు సరిపోలేదు. తర్వాత హోటల్ ప్రారంభించా. దాని కోసం అప్పులు తీసుకున్నా. అవి తీర్చలేకపోవడంతో నాపైన కేసులు పెట్టారు. చాలా కాలం జైలు జీవితం కూడా అనుభవించా. అంతే కానీ నా కలను మాత్రం వదల్లేదు' అని దిలీప్ భావోద్వేగానికి గురయ్యారు.'అప్పులపాలై జైలుకి వెళ్లి తిరిగొచ్చా. నా బంధువులే నన్ను తీవ్రంగా నిరుత్సాహపర్చారు. ఎన్నో విమర్శలు చేశారు. నాకు పిచ్చి పట్టిందన్నారు. నా జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా నా కొడుకు జీవితాన్ని కూడా కష్టాల్లోకి నెడుతున్నానని అన్నారు. కానీ వాళ్లు చేసిన ఆ విమర్శలే నాకు మరింత ధైర్యాన్నిచ్చాయి. నాకు చిన్నప్పటి నుంచి కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్ అంటే చాలా ఇష్టం. అయితే 2011 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఎంఎస్ ధోని సిక్స్ కొట్టి జట్టును గెలిపించాడు. అప్పటి నుంచి ముకుల్‌కు ధోని అంటే పిచ్చి. మ్యాచ్ గెలిచాక.. ముకుల్ దగ్గరికి వెళ్లి 'నాన్నా, ఏడ్చావా?' అని అడిగా. నా కొడుకు చిన్న చిరునవ్వుతో తలదించుకున్నాడు. ఇది ముకుల్ రోజు' అని దిలీప్ చౌదరి ఆనందబాష్పాలు చిందించారు.

# పాక్ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా.. ఈసారి అమ్మాయిలతో..

ఇస్లామాబాద్: పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా ఓ అద్భుత ఘటన చోటు చేసుకోనుంది. తొలిసారిగా పాకిస్థాన్ మహిళల ద్వైపాక్షిక సిరీస్ జరుగనుంది. జింబాబ్వే మహిళల జట్టు పాకిస్థాన్‌లో పర్యటించనుంది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, లీఈ సిరీస్ మహిళల క్రికెట్ అభివృదలో కీలక ఘట్టంగా నిలవనుంది. ఈ సిరీస్ మ్యాచ్‌లు మే 3 నుంచి 15 వరకూ మధ్య తేదీల్లో జరుగుతాయి. వన్? సిరీస్ ఐసిసి మహిళల ఛాంపియన్‌షిప్-2025-29లో



భాగంగా జరుగనుండగా.. టి-20 సిరీస్ సాధారణంగా సిరీస్‌గా పరిగణించబడుతుంది. అన్ని మ్యాచ్‌లు కరాచీ నేషనల్ బ్యాంక్ స్టేడియంలో జరుగుతాయి.

# ఐపిఎల్‌లో మరో జట్టుకు షాక్.. స్టార్ ఆల్ రౌండర్ దూరం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో ఆటగాళ్ల గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పలువురు ఆటగాళ్లు గాయాల కారణంగా పూర్తి సీజన్‌కి దూరమైతే.. మరికొందరు కొన్ని మ్యాచ్‌ల తర్వాత జట్టుతో జతకడతారని ఫ్రాంచైజీలు చెబుతున్నాయి. తాజాగా మరో జట్టుకు షాక్ తగిలింది. వరుస విజయాలతో జోష్ మీదున్న లక్నో జట్టుకి స్టార్ ఆల్ రౌండర్ దూరమయ్యాడు. గాయం కారణంగా వనిందు హసరంగా ఐపిఎల్ 2026 సీజన్‌లో ఆడటం లేదని మేనేజ్‌మెంట్ ప్రకటించింది. గత వరల్డ్ కప్ జరిగిన సమయంలో హసరంగ గాయపడ్డాడు. అతడి ఫిట్‌నెస్‌కు సంబంధించి శ్రీలంక క్రికెట్ బోర్డు ఎన్‌వోసి జారీ చేయలేదు. ఈ వారంలోనే హసరంగకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఐపిఎల్ విషయానికొస్తే.. గత మినీ వేలంలో హసరంగను లక్నో.. రూ.2 కోట్లకు దక్కించుకుంది. అయితే హసరంగ స్థానంలో మరో ఆటగాడిని జట్టులోకి తీసుకొనే విషయంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని లక్నో ఫ్రాంచైజీ డైరెక్టర్ టామ్ మూడీ వెల్లడించారు. "హసరంగ లక్నో జట్టుతో జాయిన్ కావడం లేదు. అందుకోసం మేం సన్నద్ధమయ్యాం. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటామనే నిర్ణయం 24-48 గంటల్లోగా తీసుకుంటాం" అని మూడీ తెలిపారు.






# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

## సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్



కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.






# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.



# టాప్ ప్లేస్ లో సంజయ్.. ఇది మామూలు రికార్డు కాదేమో!

భారతీయ సినీ చరిత్రలో ఒకప్పుడు రూ.100 కోట్ల క్లబ్ చేరడం అంటే గొప్ప విజయంగా భావించేవారు. అమీర్ ఖాన్ నటించిన గజినితో ట్రెండ్ మొదలై చాలా కాలం కొనసాగింది. అయితే రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి 2 తర్వాత ఇండియన్ బాక్సాఫీస్ లెక్కలు పూర్తిగా మారిపోయాయి. రూ.1000 కోట్ల క్లబ్ అనే మైల్ స్టోన్ ఏర్పడి, ప్రపంచానికి ఇండియన్ సినిమాల స్థాయి చాటి చెప్పింది. ప్రస్తుతం ఆ రూ.1000 కోట్ల క్లబ్ లో పలు సినిమాలు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆ క్లబ్ లో అత్యధిక సార్లు భాగమైన నటుడు ఎవరో తెలుసా? సీనియర్ యాక్టర్ సంజయ్ దత్. హీరోగా మాత్రమే కాకుండా విలన్, సహాయ పాత్రలు, గెస్ట్ రోల్స్ తో ఆయన సాధించిన ఆ ఘనత విశేషంగా నిలిచింది. ఇటీవల విడుదలైన భారీ సినిమాల్లో సంజయ్ దత్ కీలక పాత్రలు పోషిస్తూ వరుస విజయాలు అందుకుంటున్నారు. ముఖ్యంగా కేజీఎఫ్: చాప్టర్ 2 సినిమాలో అధీర పాత్రతో ఆయన మొదటిసారి రూ.1000 కోట్ల క్లబ్ లో అడుగుపెట్టారు. ఆ రోల్ లో ఆయన యాక్టింగ్ విపరీతంగా ఆకట్టుకుంది. లంగ్ క్యాన్సర్ తో పోరాడుతున్న సమయంలో కూడా డబ్బింగ్ పూర్తి చేయడం ఆయన డెడికేషన్ ను చూపించింది. తర్వాత షారుక్ ఖాన్ నటించిన జవాన్ సినిమాలో చిన్న పాత్రలో కనిపించినప్పటికీ, సంజయ్ దత్ తన స్క్రీన్ ప్రెజెన్స్ తో గుర్తింపు పొందారు. కొద్దిసేపు మాత్రమే కనిపించినా.. కథలో మంచి ప్రభావం చూపించారు. ఇక రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో వచ్చిన ధురంధర్ సిరీస్ సినిమాలు సంజయ్ దత్ కెరీర్ లో మరో మైలురాయిగా నిలిచాయి. ఆ రెండు భాగాల్లోనూ ఆయన అస్లాం చౌదరి అనే ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా ఆయన యాక్టింగ్ సినిమాల విజయానికి ప్రధాన బలంగా మారింది. ఆ రెండు సినిమాలు కూడా రూ.1000 కోట్ల మార్క్ ను దాటడంతో, సంజయ్ దత్ నాలుగు సార్లు ఆ క్లబ్ లో చోటు సంపాదించారు. ఈ నేపథ్యంలో సంజయ్ దత్ సాధించిన ఘనత ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రస్తుతం రూ.1000 కోట్ల క్లబ్ లో ఉన్న సినిమాల్లో దాదాపు 40 శాతం చిత్రాల్లో ఆయన భాగమవడం విశేషం. హీరోలు కాకుండా ఒక నటుడు ఈ రేంజ్ లో ప్రభావం చూపడం అరుదైన విషయం. ఇక ఆ జాబితాలో దీపికా పదుకొణె మూడు సినిమాలతో రెండో స్థానంలో నిలిచారు.




# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక



భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్ట్‌లుగా



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**